ప్రతిఒక్కరూ లక్ష్యంతో ముందుకు సాగాలి

కామారెడ్డి, జూలై 24 : కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని టేక్రియాల్ కస్తూర్బా పాఠశాలలో బుధవారం మోటివేషన్ సెషన్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా మోటివేషన్ సెషన్ ఇంపాక్ట్ సర్టిఫైడ్ ట్రైనర్ రమేశ్‌చైతన్య విద్యార్థులను ఉద్దేశించి 'జీవితంలో లక్ష్యాలు – సవాళ్లు' అనే అంశంపై ప్రసంగించారు. ప్రతి ఒక్కరూ లక్ష్యంతో ముందుకు సాగాలన్నారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులను గౌరవించినప్పుడే మంచి ఆదర్శవంతమైన సమాజ నిర్మాణం జరుగుతుందని అన్నారు. కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ లావణ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

బాన్సువాడ రూరల్, జూలై 24 : ప్రస్తుత కాలంలో జరుగుతున్న సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని సీఐ కృష్ణ విద్యార్థులకు సూచించారు. బాన్సువాడ మండలంలోని బోర్లం గ్రామ ఉన్నత పాఠశాలలో బుధవారం సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సోషల్ మీడియాలో ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, వాట్సప్, తదితర యాప్‌ల ద్వారా జరుగుతున్న మోసాలను విద్యార్థులకు వివరించారు. ప్రధానోపాధ్యాయుడు వెంకటరమణ, ఉపాధ్యాయులు శ్రీనివాస్, సంతోష్, పద్మ, నరసింహాచారి, ఆనంద్, రాజు, గంగాధర్, విద్యార్థులు పాల్గొన్నారు.

మహిళలకు చట్టాలపై అవగాహన అవసరం

భిక్కనూర్ జూలై 24: మహిళలకు చట్టాలపై అవగాహన ఉండాలని డిస్ట్రిక్ మిషన్ కోఆర్డినేటర్ శిరీష అన్నారు. జిల్లా మహిళా సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బుధవారం భిక్కనూర్ జడ్పీహెచ్ఎస్‌లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులకు కొత్త చట్టాలపై అవగాహన కల్పించినట్లు తెలిపారు. మహిళాల సాధికార కేంద్ర సిబ్బంది శారద, తులసీ, ప్రిన్సిపాల్ శ్రీనాథ్, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

అఖిల భారత అయ్యప్ప ధర్మ ప్రచార కమిటీ ఎన్నిక

నస్రుల్లాబాద్, జూలై 24 : బీర్కూర్‌లో కామారెడ్డి జిల్లా నూతన అఖిల భారత అయ్యప్ప ధర్మ ప్రచార కమిటీని బుధవారం ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారి రాష్ట్ర కమిటీ కోశాధికారి గంగాధర్ గురుస్వామి, అబ్జర్వర్ జాతీయ ఎగ్జిక్యూటివ్ కమిటీ మెంబర్ భాస్కర్ పర్యవేక్షణలో జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. కామారెడ్డి జిల్లా అధ్యక్షుడిగా సుధాకర్‌యాదవ్, ఉపాధ్యక్షుడిగా గంగాధర్, ప్రధాన కార్యదర్శిగా సుభాష్, కార్యదర్శిగా వినోద్ కుమార్, కోశాధికారిగా కృష్ణ, వాలంటీర్‌గా చంద్రశేఖర్, జిల్లా పీఆర్వోగా లక్ష్మణ్ ఎన్నుకున్నట్లు తెలిపారు.

తుజాల్‌పూర్‌లో గ్రామసభ

బీబీపేట్, జూలై 23 : మండలంలోని తుజాల్‌పూర్ గ్రామంలో ఓడీఎఫ్ ప్లస్‌పై బుధవారం గ్రామసభను ఏర్పాటు చేశారు. ఈ గ్రామసభలో బహిరంగ మల విసర్జన రహిత గ్రామం చేయాలని తీర్మానం చేశారు. వర్షాకాలం ఉన్నందున సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. ఎంపీడీవో పూర్ణచంద్రోదయకుమార్, ఎంపీవో కృష్ణ, పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్, ఆశ వర్కర్లు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

దోమకొండ, జూలై 24: దోమకొండ 132/33 కేవీ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా గురువారం పల్వంచ, మాచారెడ్డి మండలాల్లోని సబ్ స్టేషన్ల పరిధిలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని డీఈ లీయనాయక్ బుధవారం తెలిపారు. మధ్యాహ్నం 12 నుంచి రెండు గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుదని పేర్కొన్నారు.

భార్యపై హత్యాయత్నం చేసిన భర్తకు ఐదేండ్లు..

కామారెడ్డి, జూలై 24 : భార్యపై హత్యాయత్నం చేసినందుకు నిందితుడికి బుధవారం ఐదేండ్ల జైలు శిక్షతోపాటు రూ.1000 జరిమానా విధిస్తూ జిల్లా అసిస్టెంట్ జడ్జి నాగారాణి తీర్పుచెప్పారు. ఎస్పీ సింధూశర్మ తెలిపిన వివరాల ప్రకాం.. కామారెడ్డి జిల్లా లింగంపేట్ మండలం పోతాయిపల్లికి చెందిన గారబోయిన చిన్న సంగయ్య తన భార్యను వేధించి, హత్యాయత్నం చేసిన విషయంలో సాక్షాధారాలు పరిశీలించి, నేరం రుజువు కావడంతో ఐపీసీ ప్రకారం 307,498ఏ ప్రకాం దోషిగా పరిగణించి, ఐదేండ్ల సాధారణ జైలుశిక్ష, వెయ్యి రూపాయల జరిమానా విధించినట్లు తెలిపారు. కేసును విచారణ చేపట్టిన సీఐ శ్రీనివాస్, పోలీసుల తరపున వాదనలు వినిపించిన పీపీ దామోదర్‌రెడ్డి, కోర్టులో సాక్షులను ప్రవేశపెట్టిన ప్రస్తుత సీఐ రవీందర్, ఎస్సై చైతన్యకుమార్‌రెడ్డి, కోర్ట్ హెడ్ కానిస్టేబుల్ మనోహర్‌రావు, కానిస్టేబుల్ కిరణ్‌ను ఎస్పీ అభినందించారు.

ఘనంగా కేటీఆర్ బర్త్‌డే

ఎల్లారెడ్డి/ మద్నూర్/ నిజాంసాగర్/ బాన్సువాడ టౌన్/బిచ్కుంద, జూలై 24: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ జన్మదిన వేడుకలను ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఎల్లారెడ్డిలోని తెలంగాణ తల్లి ప్రాంగణంలో బీఆర్ఎస్ నాయకులు కేక్ కట్‌చేసి, ఒకరికొకరు తినిపించుకున్నారు. అనంతరం స్థానిక ప్రభుత్వ దవాఖానలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రేషన్ డీలర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు నాగం సురేందర్, నాయకులు అల్లం శ్రీనివాస్, పోచయ్య, బర్క త్‌ఖాన్, బబ్లూ, దేవదాస్, నాగరాజ్, భూపాల్, దయాకర్ తదితరులు పాల్గొన్నారు. మద్నూర్ మండలంలోని మేనూర్‌లో నిర్వహించిన కేటీఆర్ బర్త్‌డే వేడుకల్లో జుక్కల్ మాజీ ఎమ్మెల్యే హన్మంత్ షిండే పాల్గొని కేక్ కట్ చేశారు. కేటీఆర్ ఆయురారోగ్యాలతో ఉంటూ, నిరంతరం ప్రజాసేవలో పాల్గొనాలని ఆకాంక్షించారు. బీఆర్ఎస్ నాయకులు విజయ్‌కుమార్, నిజాముద్దీన్, గోవింద్, హన్మాండ్లు, రవి, రాజు, భూమయ్య, మారుతి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. మహ్మద్‌నగర్ మండల కేంద్రంలోని జడ్పీ మాజీ చైర్మన్ దఫేదార్ రాజు నివాసంలో నిర్వహించిన కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు కేక్ కట్ చేశారు. అనంతరం స్థానిక ప్రభుత్వ ఆరోగ్య ఉప కేంద్రంలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు సాదుల సత్యనారాయణ, గున్కుల్ సొసైటీ చైర్మన్ వాజిద్ అలీ, నాయకులు దఫేదార్ విజయ్‌కుమార్, సంగమేశ్వర్‌గౌడ్, మాలిష్‌రాజు, రామాగౌడ్, బొర్రా నరేశ్, సాయిలు తదితరులు పాల్గొన్నారు. బాన్సువాడ పట్టణంలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే కల్వకుంట్ల తారకరామారావు జన్మదిన వేడుకలను మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ జుబేర్, బీఆర్ఎస్ నాయకుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో ప్రజలకు పూలు, పండ్ల మొక్కలను పంపిణీ చేశారు. బిచ్కుందలో మాజీ ఎమ్మెల్యే షిండే స్థానిక నాయకులతో కలిసి కేక్ కట్ చేశారు. బిచ్కుంద ప్రభుత్వ దవాఖానలో రోగులకు పండ్లు, బోయివాడ పాఠశాల విద్యార్థులకు ప్లేట్లు పంపిణీ చేశారు. పార్టీ మండలాధ్యక్షుడు వెంకట్‌రావు దేశాయ్, ఏఎంసీ మాజీ చైర్మన్ రాజు, సొసైటీ వైస్ చైర్మన్ యాదారావు తదితరులు పాల్గొన్నారు.

బాన్సువాడలో మొక్కలను పంపిణీ చేస్తున్న నాయకులు

మహ్మద్‌నగర్‌లో కేక్ కట్ చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

ఎల్లారెడ్డిలోని దవాఖానలో పండ్లు పంపిణీ చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

బిచ్కుందలోని బోయివాడ పాఠశాలలో విద్యార్థులకు ప్లేట్లు పంపిణీ చేస్తున్న నాయకులు

మహిళలకు అవగాహన కల్పించాలి

బాన్సువాడ టౌన్, జూలై 24 : డ్వాక్రా సంఘాల ద్వారా రుణాలు తీసుకునేలా మహిళలకు అవగాహన కల్పించాలని బాన్సువాడ మున్సిపల్ కమిషనర్ శ్రీహరి రాజు తెలిపారు. మున్సిపల్ కార్యాలయంలో బుధవారం మున్సిపల్ కమిషనర్ ఆర్పీలతో అవగాహన సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో మెప్మా అధికారి రవిశంకర్, మున్సిపల్ ఆర్పీలు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

బిల్లులు వెంటనే చెల్లించాలి

భిక్కనూర్, జూలై 24 : మాజీ సర్పంచులకు రావాల్సిన బిల్లులు వెంటనే చెల్లించాలని సర్పంచుల ఫోరం జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు రాములు అన్నారు. మండల కేంద్రం లో బుధవారం విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం స్పందించి బిల్లులు ఇప్పించాలని కోరారు. బిల్లులు చెల్లించకపోతే ఆత్మహత్యలు చేసుకోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు.

కేజీబీవీలో వైద్య శిబిరం

రాజంపేట్, జూలై 24 : మండల కేంద్రంలోని కేజీబీవీలో బుధవారం వైద్యశిబిరం నిర్వహించినట్లు రాజంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు విజయ మహాలక్ష్మి తెలిపారు. 239 మంది విద్యార్థులకు వైద్యపరీక్షలు చేసినట్లు తెలిపారు. మండల సూపర్‌వైజర్ మంజూర్, ఆరోగ్య కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు క్షమాపణ చెప్పాలి

కామారెడ్డి, జూలై 24 : ఐఏఎస్ అధికారిణి స్మితా సభర్వాల్ ట్విట్టర్ వేదికగా కేంద్ర ప్రభుత్వ సర్వీసు ఉద్యోగాల్లో దివ్యాంగుల రిజర్వేషన్లు అవసరం లేదని వ్యాఖ్యానించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని విజ్ఞాన్ దివ్యాంగుల సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు చిప్ప దుర్గాప్రసాద్ అన్నారు. బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడా రు. దివ్యాంగులు చాలా మంది ఉన్నతస్థాయిలో ఉన్నారని అన్నారు. కేంద్ర ప్రభుత్వం స్పందించి 2016 దివ్యాంగుల చట్టం ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సబ్ కమిటీ చైర్మన్ ఈశ్వర్, జిల్లా అధ్యక్షుడు నర్సింహులు పాల్గొన్నారు.

నిబంధనలకు విరుద్ధంగా డిప్యుటేషన్లు

కామారెడ్డి, జూలై 24 : జిల్లాలో నిబంధనలకు విరుద్ధంగా డిప్యుటేషన్లు తీసుకున్న ఉపాధ్యాయులను వెంటనే వెనక్కి రప్పించాలని బుధవారం ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో డీఈవో రాజుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నిబంధనలకు విరుద్ధంగా డిప్యుటేషన్ ఇచ్చారన్నారు. మళ్లీ సమీక్షించి డిప్యుటేషన్లను రద్దు చేయాలని అన్నారు. కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర కోశాధికారి సంగయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

హత్యకేసులో ఒకరికి జీవితఖైదు

కామారెడ్డి, జూలై 24 : తండ్రిని హత్య చేసిన కేసులో కుమారుడైన నిందితుడికి జీవితఖైదుతో పాటు రూ. 20 వేల జరిమానా విధిస్తూ కామారెడ్డి జిల్లా న్యాయమూర్తి సీహెచ్.వీఆర్ఆర్ వరప్రసాద్ బుధవారం తీర్పు వెల్లడించారు. ఎస్పీ సింధూశర్మ తెలిపిన వివరాల ప్రకారం.. క్యాసంపల్లి తండాకు చెందిన భూక్యా ఫకీరాను తన కుమారుడు భూక్యా భాషా ఉగ్రవాయి శివారులో ఇంద్రసేనారెడ్డి పొలం వద్ద 2021 మార్చి 9వ తేదీన హత్య చేశాడు. మృతుడి తమ్ముడి కుమారుడు భూక్యా హుస్సేన్ దేవునిపల్లి పోలీస్ స్టేషన్‌లో ఈ విషయమై ఫిర్యాదు చేయగా.. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపటాటరు. మృతుడి తమ్ముడి కుమారులు, కూతురిని, గ్రామస్తులను విచారించి భూక్యా భాషాను అరెస్టు చేసి కోర్టులో హాజరుపర్చారు. కేసులో సాక్షులను విచారించి, సాక్షాధారాలను పరిశీలించి, కేసు రుజువు కావడంతో జిల్లా న్యాయమూర్తి నిందితుడికి జీవితఖైదుతో పాటు రూ. 20 వేల జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చారు. కేసును విచారణ చేపట్టిన సీఐ చంద్రశేఖర్‌రెడ్డి, పోలీసుల తరపున వాదనలు వినిపించిన పీపీ రాజగోపాల్ గౌడ్, కోర్టులో సాక్షులను ప్రవేశపెట్టిన ప్రస్తుత సీఐ రామన్, ఎస్సై రాజు, కోర్టు కానిస్టేబుల్ బాలకృష్ణ, దేవీచందర్‌ను ఎస్పీ అభినందించారు.

ప్రమాదకరంగా ఉన్న ఇండ్లను వెంటనే తొలగించాలి

కామారెడ్డి, జూలై 24 : కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని టేక్రియాల్ 13వ వార్డులో మున్సిపల్ చైర్‌పర్సన్ ఇందూ ప్రియ ప్రమాదకరమైన ఇండ్లను బుధవారం పరిశీలించారు. పెచ్చులు ఊడిపోయి ప్రమాదకరంగా ఉన్న ఇండ్లను వెంటనే తొలగించాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. అలాగే రోడ్లపై ఉన్న గుంతలను పూడ్చాలని, మురికి కాలువలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని, తాగునీటికి ఇబ్బంది కలుగకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సుజాత, కౌన్సిలర్లు శంకర్‌రావు, పాత కృష్ణమూర్తి, చాట్ల వంశీ, నాయకులు అంజద్, పంపరి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

మద్నూర్ మండలం లచ్చన్‌లో

మద్నూర్, జూలై 24: నాలుగైదు రోజులుగా కురుస్తున్న వర్షాలకు లచ్చన్ గ్రామంలో కూలిన ఇంటిని తహసీల్దార్ ముజీబ్ బుధవారం పరిశీలించారు. జరిగిన నష్టానికి సంబంధించి నివేదికను తయారు చేసి ఉన్నతాధికారులకు అందజేస్తామని ఆయన తెలిపారు. ముసురు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలు జాగ్రత్తగా ఉండాలన్నారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి సంగీత ఉన్నారు.

సాందీపని, వశిష్ట విద్యార్థుల విజయకేతనం

కామారెడ్డి, జూలై 24 : తెలంగాణ యూనివర్సిటీ ప్రకటించిన సెమిస్టర్–2, 4 ఫలితాల్లో సాందీపని, వశిష్ట డిగ్రీ కళాశాలలు విజయకేతనం ఎగరవేసింది. అత్యధిక ఉత్తీర్ణత శాతంతోపాటు అన్ని విభాగాల్లో యూనివర్సిటీ టాపర్లుగా నిలిచారు. సాందీపని డిగ్రీ కళాశాల విద్యార్థులు ఎంఎస్‌టీడీఎస్ సెమిస్టర్ 2 విభాగంలో డి.రచన 9.84, ఎన్‌జెడ్‌సీ సెమిస్టర్ 2 విభాగంలో భవాని 9.84, ఎంఎస్‌టీడీఎస్ సెమిస్టర్ 4 విభాగంలో భానురేఖ 9.84. అక్షయ 9.72 సాధించి యూనివర్సిటీ టాపర్లుగా నిలిచారు. వశిష్ట డిగ్రీ కళాశాల విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించారు. బీకాం విభాగంలో సల్మా ఫాతిమా 10/10, సానియా సమ్రిన్ 9.48, సలేహా మటీన్ 9.40, బైపీసీ విభాగంలో నగ్మా సిద్దిక 9.52, మధుప్రియ 9.40, బీజేసీలో వైష్ణవి 9.36 సాధించారు. వీరిని కళాశాలల మేనేజింగ్ డైరెక్టర్ హరిస్మరణ్‌రెడ్డి, సాందీపని కళాశాల ప్రిన్సిపాల్ సాయిబాబు, అకడమిక్ ప్రిన్సిపాల్ మనోజ్‌కుమార్, వశిష్ట కళాశాల ప్రిన్సిపాల్ అనిల్‌రెడ్డి, అధ్యాపకులు అభినందించారు.

రచన

భాను రేఖ

భవాని

అక్షయ

సల్మా

కొనసాగుతున్న వన మహోత్సవం

లింగంపేట, జూలై 24: వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో మండలంలోని మెంగారం, లింగంపేట, లింగంపల్లి, మోతె, పర్మళ్ల, భవానీపేట, బోనాల్, ఎక్కపల్లి, శెట్పల్లిసంగారెడ్డి, అయ్యపల్లి, సురాయిపల్లి తదితర గ్రామాల్లో ఉపాధి హామీ కూలీలతో మొక్కలను నాటిస్తున్నట్లు ఎంపీడీవో నరేశ్ తెలిపారు. ఎక్కపల్లిలో నిర్వహించిన కార్యక్రమంలో ఎంపీడీవో మొక్కను నాటారు. నాటిన ప్రతి మొక్కనూ రక్షించేలా చర్యలు తీసుకోవాలని గ్రామ పంచాయతీ కార్యదర్శులకు సూచించారు.

రైతుబీమా చేయించుకోవాలి

బీమా దరఖాస్తులను స్వీకరిస్తున్న ఏఈవో నామ్‌దేవ్

డోంగ్లీ, జూలై 24: అర్హులైన రైతులందరూ తప్పనిసరిగా రైతు బీమా చేయించుకోవాలని ఏఈవో నామ్‌దేవ్ అన్నారు. మండలంలోని లింబూర్ రైతువేదికలో ఆయన పలువురు రైతుల నుంచి బీమా దరఖాస్తులను బుధవారం స్వీకరించారు. కార్యక్రమంలో క్లస్టర్ పరిధిలోని ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

రైతుబీమా కోసం దరఖాస్తు చేసుకోవాలి..

గాంధారి, జూలై 24: కొత్తగా పట్టాపాస్ పుస్తకాలు పొందిన రైతులు రైతు బీమా కోసం దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యసాయాధికారి నరేశ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గత సంవత్సరం జూన్ 28వ తేదీ వరకు భూములు కొనుగోలు చేసి ధరణి పోర్టల్‌లో రిజిస్ట్రేషన్ చేసుకున్న రైతులతోపాటు, ఇప్పటి వరకు రైతు బీమాకు దరఖాస్తు చేసుకొని వారు అర్హులని తెలిపారు. రైతులు ఆగస్టు ఐదో తేదీ వరకు దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం ఉన్నదని, స్థానిక ఏఈవోలకు దరఖాస్తు ఫారాలను అందజేయాలని సూచించారు. బీమాలో మార్పులు, చేర్పులకు ఈనెల 30వ తేదీ వరకు అవకాశం ఉన్నదని పేర్కొన్నారు.

నాగిరెడ్డిపేటలో ముసురు

నాగిరెడ్డిపేట, జూలై 24: మండలంలో ఐదు రోజులుగా ముసురు కురుసున్నది. ఆకాశం పూర్తిగా మేఘావృతమై ఉంటున్నది. రైతులు భారీ వర్షాల కోసం ఎదురు చూస్తుండగా.. చిరు జల్లులు మాత్రమే కురుస్తున్నాయి. చెరువులు, కుంటల్లోకి నీరు రావడం లేదని రైతులు ఆవేదన చెందుతున్నారు.

ఉపాధ్యాయులకు సన్మానం

ఎల్లారెడ్డి రూరల్, జూలై 24: మండలంలోని అడ్విలింగాల్ జడ్పీహెచ్ఎస్‌లో పనిచేసి బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులను హెచ్ఎం శివనరసింహారావు ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా సన్మానించారు. ఉత్తమ బోధనతోనే ఉపాధ్యాయులకు గుర్తింపు లభిస్తుందన్నారు. బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులు అంజయ్య, సుభాష్, మాన్య, యాదయ్య, రామచంద్రమూర్తి, కిషన్‌కు పూలమాల వేసి శాలువా కప్పి సత్కరించారు.

అనారోగ్యంతో మాజీ సర్పంచ్ మృతి

శర్యాయప్ప స్వామి (ఫైల్)

డోంగ్లీ, జూలై 24: డోంగ్లీ గ్రామ మాజీ సర్పంచ్ శర్యాయప్ప స్వామి అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు దవాఖానలో మంగళవారం రాత్రి మృతిచెందారు. బుధవారం నిర్వహించిన ఆయన అంత్యక్రియల్లో జుక్కల్ మాజీ ఎమ్మెల్యే హన్మంత్ షిండే పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను త్వరగా పూర్తిచేయాలి

అడిషనల్ కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి

మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేస్తున్న అడిషనల్ కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి

రామారెడ్డి, జూలై 24: రామారెడ్డి కస్తూర్బా పాఠశాలలో చేపడుతున్న అమ్మ ఆదర్శ పాఠశాల అభివృద్ధి పనులను త్వరగా పూర్తిచేయాలని అడిషనల్ కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి సంబంధిత అధికారులకు సూచించారు. రామారెడ్డిలో ఆయన బుధవారం పర్యటించారు. కాలభైరవ స్వామి ఆలయం రోడ్డు పక్కన ఉన్న డ్రైనేజీని పరిశీలించారు. గ్రామ పంచాయతీలో రికార్డులను తనిఖీ చేశారు. పంచాయతీ కార్యదర్శి క్రాంతికుమార్‌కు పలు సూచనలు చేశారు. కస్తూర్బాలో వంట గది పరిసరాలు శుభ్రంగా ఉంచాలని సూచించారు. ఆయనవెంట జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాసరావు, డీఎల్పీవో శ్రీనివాస్, ఎంపీవో తిరుపతిరెడ్డి తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం వడ్డించాలి

జడ్పీ సీఈవో చందర్‌నాయక్

పుల్కల్ దవాఖానలో వివరాలు తెలుసుకుంటున్న జడ్పీ సీఈవో చందర్‌నాయక్

బిచ్కుంద, జూలై 24: విద్యార్థులకు మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం వడ్డించాలని జడ్పీ సీఈవో, మండల ప్రత్యేకాధికారి చందర్‌నాయక్ అన్నారు. బిచ్కుందతో పాటు పుల్కల్ గ్రామంలో స్థానిక ఎంపీడీవో గోపాలకృష్ణతో కలిసి ఆయన బుధవారం పర్యటించారు. పుల్కల్ జడ్పీహెచ్ఎస్‌లో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ప్రభుత్వ దవాఖానను సందర్శించి రోగులకు అందుతున్న వైద్య సేవలను తెలుసుకున్నారు. రికార్డులను తనిఖీ చేశారు. బిచ్కుంద కస్తూర్బా పాఠశాలను సందర్శించి వసతులు, విద్యాబోధన తదితర విషయాలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు యూనిఫామ్‌లను పంపిణీ చేయడంతోపాటు పాఠశాల ఆవరణలో మొక్కను నాటారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఎంపీవో అబ్బాగౌడ్, డాక్టర్ ఉమాకాంత్, కస్తూర్బా ప్రిన్సిపాల్ రాగిణి, ఐకేపీ ఏపీఎం నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటా ఇన్నోవేటర్ వాల్ పోస్టర్ల ఆవిష్కరణ

నాగిరెడ్డిపేటలో పోస్టర్లను ఆవిష్కరిస్తున్న జిల్లా కో–ఆర్డినేటర్ గగన్, పంచాయతీ కార్యదర్శులు

గాంధారి/ నాగిరెడ్డిపేట, జూలై 24: గాంధారిలోని ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం ఇంటింటా ఇన్నోవేటర్ వాల్ పోస్టర్లను డివిజనల్ పంచాయతీ అధికారి సురేందర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామీణ యువతలోని నైపుణ్యాలను, కొత్త ఆవిష్కరణలను వెలికి తీసి ప్రోత్సహించడానికి రాష్ట్ర ప్రభుత్వం ఇంటింటా ఇన్నోవేటర్ కార్యక్రమాన్ని చేపడుతున్నదని తెలిపారు. కొత్త ఆవిష్కరణలు, పరికరాలు కనిపెట్టిన వారు వాటి ఫొటోలు, వీడియోలు గ్రామ పంచాయతీ కార్యాలయం లేదా ఎంపీడీవో కార్యాలయంలో ఆగస్టు 3వ తేదీలోపు అందజేయాలని సూచించారు. జిల్లా కో–ఆర్డినేటర్ గగన్, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

నాగిరెడ్డిపేట మండల పరిషత్ కార్యాలయంలో ఇంటింటా ఇన్నోవేటర్ పోస్టర్లను జిల్లా కో–ఆర్డినేటర్ గగన్ పంచాయతీ కార్యదర్శులతో కలిసి ఆవిష్కరించారు. ఎంపీవో ప్రభాకర్, ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు చేపట్టాలి

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో నరేశ్

లింగంపేట, జూలై 24: వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో గ్రామాల్లో పారిశుద్ధ్య పనులను పకడ్బందీగా చేపట్టాలని ఎంపీడీవో నరేశ్ అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో గ్రామ పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్లతో బుధవారం ప్రత్యేక సమావేశం నిర్వహించి మాట్లాడారు. మురికి నీరు నిల్వ ఉండకుండా గుంతలు పూడ్చివేయించాలన్నారు. గ్రామాల్లో ఫాగింగ్ చేయించాలని, వన మహోత్సవంలో భాగంగా లక్ష్యం మేరకు మొక్కలను నాటించాలని సూచించారు. ఇండ్ల వద్ద నాటేందుకు అవసరమైన మొక్కలను పంపిణీ చేయాలన్నారు. సమావేశంలో ఎంపీవో మలహరి, ఏపీవో అన్నపూర్ణ, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్, టెక్నికల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

బ్యాంకు రుణాలపై అవగాహన

అవగాహన కల్పిస్తున్న బ్యాంకు అధికారులు

ఎల్లారెడ్డి రూరల్, జూలై 24: బ్యాంకు రుణాలపై ప్రజలు, వ్యాపారస్థులకు ఎల్లారెడ్డి తెలంగాణ గ్రామీణ బ్యాంకు మేనేజర్, అధికారులు అవగాహన కల్పించారు. పట్టణంలోని గాంధీచౌక్ వద్ద బుధవారం ఏర్పాటు చేసిన రుణమేళాలో వారు బ్యాంకులు అందజేసే రుణాలపై అవగాహన కల్పించారు. ఇండ్లు, వ్యాపార రుణాలు, బంగారు ఆభరణాలపై ఇచ్చే లోన్లను వివరించారు. కార్యక్రమంలో నిజామాబాద్ సీనియర్ బిజినెస్ మేనేజర్ అనిల్‌కుమార్, జిల్లా రికవరీ అధికారి సాయన్న, బాన్సువాడ హబ్ మేనేజర్ ప్రవీణ్, ప్రాసెసింగ్ ఆఫీసర్ యశ్వంత్, తెలంగాణ గ్రామీణ బ్యాంకు ఎల్లారెడ్డి శాఖ మేనేజర్ సంతోష్‌కుమార్, ఫీల్డ్ ఆఫీసర్లు వంశీ, ప్రశాంత్, పట్టణ ప్రజలు పాల్గొన్నారు.

కొనసాగుతున్న వైద్య శిబిరం

లింగంపేట/నిజాంసాగర్, జూలై 24: లింగంపేట పంచాయతీ కార్యాలయంలో నిర్వహిస్తున్న ప్రత్యేక వైద్య శిబిరం రెండో రోజూ బుధవారం కొనసాగింది. గ్రామస్తులు విష జ్వరాలతో బాధపడుతుండడంతో గ్రా మంలో వైద్